ప్రజాశక్తి

ఆదివారం 9 మార్చి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

‘వెలిగొండ’ను పూర్తి చేస్తా..

- కృష్ణా జలాలతో పాటు గోదావరి జలాలు ‘ప్రాజెక్టు’కు తరలింపు
- మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తా..
- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సిఎం చంద్రబాబు
- మహిళల రక్షణకు ‘శక్తి’ యాప్ ప్రారంభం

5లో ▶





అభివాదం చేస్తున్న సిఎం చంద్రబాబు, హాజరైన మహిళలు



టిడ్కో గృహ సముదాయం వద్ద సిపిఎం నాయకులు

టిడ్కో ఇళ్లను తక్షణమే పూర్తిచేయాలి

- లబ్ధిదారులను రాజకీయాలకు బలి చేయొద్దు
- తొలిదశలోనే ఇళ్ల నిర్మాణం పూర్తి గావించాలి
- ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం నగర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఏడేళ్ల క్రితం ప్రారంభించిన టిడ్కో ఇళ్ల నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని, పేదల సొంతింటి కలను నెరవేర్చాలని సిపిఎం డిమాండ్ చేసింది. గత ఏడేళ్లుగా లబ్ధిదారులు అధికార, ప్రతిపక్ష రాజకీయ ఉచ్చుకు బలయ్యారని ఆ పార్టీ తీవ్రంగా విమర్శించింది. ప్రజా చైతన్యయాత్రలో భాగంగా శనివారంనాడు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు నగర పరిధిలోని చింతల, కొప్పోలులో టిడ్కో ఇళ్ల సముదాయాలను బృందం పరిశీలించింది. అనంతరం ఆ పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2018లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రారంభం చేపట్టిన టిడ్కో ఇళ్ల ప్రక్రియను, తరువాత అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం రాజకీయరంగుతో తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. 9 నెలల క్రితం తిరిగి అధికారం చేపట్టిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టక రాజకీయ విమర్శలకు పూనుకోవడం సిగ్గుచేటని ఆరోపించారు. ఈ బడ్జెట్‌లో టిడ్కో గహాల నిర్మాణ ప్రస్తావన లేకుండా విమర్శలకు పాల్పడటం లబ్ధిదారులను మభ్య పెట్టడమేనని విమర్శించారు. అప్పటి ప్రభుత్వమే లబ్ధిదారుల చేత బ్యాంకు రుణాలు మంజూరు చేయించి, గృహాలు పొందకుండానే వడ్డీలు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడటం అత్యంత విచారకరమన్నారు. పార్టీ ▶ 2లో



చెక్కు అందజేస్తున్న మంత్రులు పార్థసారథి, సత్యప్రసాద్

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

- ఆదర్శవంతమైన సమాజానికి మహిళలే స్ఫూర్తి
- మహిళా సాధికారిత ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-రేపల్లె

ఆదర్శవంతమైన సమాజ నిర్మాణంలో మహిళలు కీలకమైన పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ దినోత్సవ సందర్భంగా పట్టణంలోని మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ హాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వివిధ రంగాలలో నైపుణ్యం సాధించిన మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు సమాజంలో తల్లిగా, చెల్లిగా, అక్కగా, భార్యగా కుటుంబ బాధ్యతలను చక్కదిద్దుతూ పురుషులకు సేవలందిస్తున్న మణిహారాలని కొనియాడారు. మహిళలు ఎక్కడైతే పూజించబడతారో అక్కడ సిరిసంపదలు వర్ధిల్లుతాయని అన్నారు. నారీమణుల సేవలతోనే సమాజం అభివద్ధి చెందుతుందని చెప్పారు. 30 సంవత్సరాల క్రితం మన సమాజంలో మహిళ వంటింటికి పరిమితమై ఉందన్నారు. కానీ నేడు మహాశక్తిగా ఎదిగి అన్ని రంగాలలో తనదైన శైలిలో గుర్తింపు పొందారని తెలిపారు. మహిళలు లేని సమాజాన్ని ఊహించలేమని, మహిళలు లేకపోతే సమాజం అంధకారమవుతుందని అన్నారు. డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అన్నారు. మే నెల నుండి తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ, మరియు జిల్లా ▶ 2లో



ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలి

మెయిన్ 6లో ▶

టిడ్కో ఇళ్లను తక్షణమే పూర్తిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నగర కార్యదర్శివర్గ సభ్యులు జి.రమేష్ మాట్లాడుతూ టిడ్కో గహ సముదాయాలలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చింతల, కొప్పోలు రెండు ప్రాంతాల్లోనూ గహ సముదాయాలు నివాసయోగ్యంగా లేవని, వరద నీరు, చిల్లకంపతో నిండిపోయి ఉన్నాయని, తక్షణం ఆ ప్రాంతాల్లో గుంటలు పూడ్చటం, చదును చేయటం వంటి పనులతో పాటు రోడ్లు, విద్యుత్తు, తాగునీటి వసతి వంటి వనరులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిదశ బడ్జెట్లోనే ప్రాధాన్యత కల్పించి సకాలంలో నిర్మాణాలు పూర్తిగా వించాలని ఆయన కోరారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కంకణాల రమాదేవి మాట్లాడుతూ చింతల, కొప్పోలు లో ఉన్న గృహ సముదాయాలవద్ద ఎటువంటి భద్రత లేదన్నారు. పనులు నిర్వహించుకునే వారి సామాగ్రి మెటీరియల్ దొంగల పాలవుతున్నట్లు వివరించారు. అక్కడ పటిష్టమైన రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి కల్పన, బి రఘురాం, నగర కమిటీ సభ్యులు తంగిరాల మహేష్, సయ్యద్ హుస్సేన్, బివి రావు, దారా వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు దామా శ్రీనివాసరావు పార్టీ నాయకులు సిహెచ్ వినోద్, తోట తిరుపతిరావు, కొండూరి విశ్వసేన్, హనుమంతరావు, రాఘవరావు, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

(మొదటిపేజీ తరువాయి)

ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ వ్యాపార వాణిజ రంగాలలో స్థిరపడే మహిళలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున సాయం అందించేందుకు కషి చేస్తోందన్నారు. వివక్ష లేని సమాజ స్థాపన మహిళలకు అండగా ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మాట్లాడుతూ మహిళల హక్కులు, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేదికగా మారిందన్నారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, సంయుక్త కలెక్టర్ ప్రఖర్జైన్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు, జిల్లా వైద్య అధికారి విజయమ్మ, సర్వశిక్ష అభియాన్ డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, ఆర్‌డిఓ రామలక్ష్మి, బుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు, తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే సోదరుడు

ప్రజాశక్తి-కొమరోలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణ కిషోర్ రెడ్డి

కొమరోలు మండలం ఎడమకల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన కళ్యాణరామ, పట్టాభిరామ సమేత సీతారామస్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ సోదరుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ నాయకులు వారికి పూలమాల, శాలువాలు వేసి మేళాతాళాలతో ఆలయం వరకు ఘన స్వాగతం పలికారు. మొదటగా ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కొమరోలు మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, గోడి ఓబుల్‌రెడ్డి, వెంకటయ్య, బొంత శ్రీనివాస్‌రెడ్డి, గురుస్వామిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఏకేయూ విసి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం యూనివర్శిటీ ప్రాంగణంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటు జరుగుతున్న ఫిట్ ఇండియా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ దేవీ వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలు పురోభివృద్ధి సాధిస్తున్నారని విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పురుషులతో పాటు సమానంగా పోటీ పడుతున్నారని అన్నారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేవీ వర ప్రసాద్ మాట్లాడుతూ మదర్ థెరిస్సా, సరోజినీ నాయుడు, సునీత విలియమ్స్ లాంటి మహిళామూర్తులను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాలలో మహిళలు ముందుకు సాగాలని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్ర కేసరి యూనివర్శిటీ తరపున ఏర్పాటు చేసిన 6కే రన్ కార్యక్రమాన్ని విసి ప్రొఫెసర్ మూర్తి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏకేయూ ఎంఎడ్ విభాగం సహాయ ఆచార్యురాలు డాక్టర్ అమృతవల్లి, శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వసంతలక్ష్మి, మహిళా అధ్యాపకులు ఏ సిరి తేజ, పి నాగలక్ష్మి తదితరుల తోబాటు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సహాయ ఆచార్యుడు ఆడపాల వెంకటేశ్వర్లు, బిపిఎడ్, ఎంపిఎడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'నెమలిగుండ్ల' ఆలయంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం జే పుల్లల చెరువు గ్రామ సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో గల నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం ఆలయ ఆవరణలో షాపుల నిర్వహణ కోసం దేవదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఆలయ నూతన కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన మల్లవరపు నాగయ్య మొదటగా రంగనాయక స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలం పాటలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో గత సంవత్సరం ఐస్‌క్రీమ్ అమ్ముకునేందుకు లక్షా నలభై వేల రూపాయలతో పాట పాడగా ఇప్పుడు రూ.1,90,000 ఐస్ క్రీమ్ అమ్ముకోవటానికి వేలం పాట పాడారు. గుండం వద్ద ఫోటోలు తీసుకునే హక్కు కోసం గత సంవత్సరం 14 వేల రూపాయలతో పాటపాడగా ఈ సంవత్సరం 18 వేల రూపాయలతో వేలంపాట జరిగింది. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రెండు ఐటములకు కలిపి శనివారం జరిగిన వేలంపాటల ద్వారా ఆలయానికి 54 వేల రూపాయల ఆదాయం పెరిగింది. అర్ధవీడు మండలం వీరభద్రపురం గ్రామం కలగట్ల సాయికుమార్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా వేమారెడ్డి అన్నదాన సత్రంలో అన్నదానం, కాశిరెడ్డి నాయన అన్నదాన సత్రం, శ్రీకృష్ణ యాదవ అన్నదాన సత్రం, శ్రీకృష్ణదేవరాయ బలిజ అన్నదాన సత్రాల్లో అన్నదానం కార్యక్రమాలు జరిగాయి. ఆలయ నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన మల్లవరపు నాగయ్యను శ్రీకృష్ణదేవరాయ అన్నదాన సత్రం చైర్మన్ కన్నసాని గోపాలరావు, బొల్లారం ఆదినారాయణ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వేలం పాటల్లో ఆలయ ఈఓ మల్లవరపు నాగయ్య, గిద్దలూరు పాతాళ నాగేశ్వ స్వామి ఆలయ ఈవో చిక్కుడు శ్రీనివాసులు ఆలయ జూనియర్ సహాయకులు రాజేశ్వరరావు, శ్రీకాంత్, పాటదారులు పాల్గొన్నారు.

11న జరిగే చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్‌లో జరుగనున్న నౌకరిదేవ్ నాశనహి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ అన్నలదాస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ కల్పనలో విఫలమయ్యాయని తెలపారు. నిరుద్యోగులకు వెంటనే అవకాశాలు కల్పించాలని, యువతకు స్వయం సహకార ఉపాధి కల్పించాలని కోరారు. అలా చేయలేని యెడల వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, జాతీయ అధ్యక్షుడు ఉదయభాను ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

నూరు శాతం ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మాట్లాడుతున్న డీఈవో కిరణ్ కుమార్

యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంత్రు నాయక్ అధ్యక్షతన ఉత్సాహంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో ఎ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉన్న కొద్ది సమయం ఉపాధ్యాయులు చెప్పే సూచనలు పాటించాలని, ఒక క్రమబద్ధమైన టైం టేబుల్ ఏర్పాటు చేసుకుని చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. మంచి ఫలితాలతో పాఠశాలకు, తల్లిదండ్రులకు, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకునిరావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శామ్యూల్ జాన్, ఎంఈవోలు ఆంజనేయులు, మస్తాన్‌నాయక్, మల్లూ నాయక్, రాజశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు హేమ్లా నాయక్, బాలూ నాయక్, ఎపిజీబి మేనేజర్ రంజం నాయక్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు నాయక్, శ్రీదేవి, లక్ష్మీదేవి, కృష్ణమూర్తి నాయక్, దేవ ప్రసాద్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాచైతన్య యాత్రలో సీపీఎం నేతలకు మహిళల మొర

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల మండలంలోని కుక్కలవారిపాలెంలో ప్రారంభించి నిలిపివేసిన అంతర్గత సిమెంటు రోడ్లను వెంటనే పూర్తి చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కుక్కలవారిపాలెంలో ప్రజాసంఘాల నాయకులు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేంకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సిపిఎం బాపట్ల పట్ట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా చైతన్య యాత్రను సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు ప్రారంభించారు. సిపిఎం నాయకులు గ్రామ వీధుల్లో పర్యటించారు. గ్రామంలో రక్షిత మంచినీరు రావటం లేదని చెప్పారు. రోడ్డు ప్రారంభించి సగంలో వేయడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఆగిన రోడ్లు వెంటనే వేయాలని పలుమార్లు పార్టీల నాయకులను అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని చెప్పారు. అలాగే సుమంత్ రైస్ మిల్ నుంచి విపరీతంగా దుమ్ము, ధూళి గృహాలపై ఆవరించి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, గ్రామం పైకి దుమ్ము రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు తెలిపినట్లు చెప్పారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గ్రామంలో 4 వీధులు పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కృష్ణమోహన్, మంజుందర్, జిల్లా కమిటీ సభ్యులకు కొండయ్య, పార్టీ నాయకులు శరత్, నాగేశ్వరరావు, కోటా వెంకటేశ్వర రెడ్డి, భాస్కరరావు, తిరుమలరెడ్డి, బి.దినేష్, సుబ్బారెడ్డి, అయ్యప్ప రెడ్డి పాల్గొన్నారు.



ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

అద్దంకి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మహిళలు సిపిఎం యాత్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా అద్దంకిలో మందుతోకపాలెంలో ప్రజా చైతన్య యాత్ర ద్వారా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకునే కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మొండితోక పాలెం, ఎరుకల కాలనీ గుర్రాల కాలనీలలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు బృందం దృష్టికి పలు రకాలు సమస్యలను వివరించారు. ప్రధానంగా సైడ్ కాలవలు తీయడం లేదని తద్వారా మురికి కూపంగా మారి దోమలకు నిలయాలుగా మారాయని తెలిపారు. ప్రతి ఇంటా అనారోగ్యాలు పాలవుతున్నారన్నారు. రేషన్ కార్డులను కుటుంబాల వారీగా విడివిడిగా ఇవ్వటం ద్వారా అన్ని రకాల సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రభుత్వం తమకు వెంటనే కార్డులు ఇప్పించేలా చూడాలన్నారు. ఎన్నికల హామీలైన ఉచిత గ్యాస్ సక్రమంగా అమలు కావడం లేదని కొంతమందికి డబ్బులు పడటం లేదని తెలిపారు. మంచినీళ్ల పైపులైన్లు కోసం రోడ్లు పగలగొట్టారని కనీసం వాటికి మరమ్మత్తులు కూడా చేయలేదని చెప్పారు. కాలనీలో బెల్ట్ షాపులు నిర్మూలించాలన్నారు. సమస్యలను సావధానంగా విన్న గంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకి నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారని అది అమలు కాలేదని, ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు కాలేదని, అలాగే స్థానిక సమస్యలు కోకొల్లలుగా వస్తున్నాయని వాటి పరిష్కారం కోసం సిపిఎం చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలు విరివిరిగా పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టౌన్ పార్టీ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, బి.విజయ్ కుమార్, ఆదాము సామేలు, నాగేశ్వరరావు, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.





క్షతగాత్రులు శివన్నారాయణ, బలరాం

బైక్‌ని ఢీకొన్న కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

బైక్‌ని కారు ఢీకొన్న ప్రమాదంలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఇద్దరు బస్సు డ్రైవర్లు తీవ్రంగా గాయపడిన ఘటన మార్టూరు సమీపంలోని ఇసుక దర్శి వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం.. మార్టూరులోని రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఇద్దరు బస్సు డ్రైవర్లు రామిశెట్టి శివన్నారాయణ, నాగండ్లకు చెందిన దండు బలరాం ముప్పవరంలో బస్సులను పెట్టి తిరిగి బైక్‌పై మార్టూరు వస్తుండగా ఇసుక దర్శి సమీపంలోని టీ స్టెప్ వద్ద వెనకనుంచి అతివేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ని బలంగా ఢీకొట్టింది. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులన ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు గ్రామానికి చెందిన ఆరుగురికి శనివారం వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన పక్కెల సలోమికి రూ.1,48,592, పెరికల నరసింహారావుకు రూ.79,969, మద్దుల పద్మజకు రూ.78,819, పప్పల శ్రీకాంత్ బాబుకు రూ.54,833, పట్టాన్ సుబాన్ ఖాన్‌కు రూ.46,503, కుక్కల దివ్యాన్షకు రూ.20,934 వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి - చీరాల

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని అలాంటి వాటిని ప్రోత్సహించకూడదని అంగన్వాడి కార్యకర్తలు అన్నారు. శనివారం అంగన్వాడీల ఆధ్వర్యంలో పట్టణంలోని వైకుంటపురం జాలమ్మ గుడి సమీపంలో ఉన్న సి సెక్టార్ అంగన్వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారాన్ని

'యువతపోరు'ను జయప్రదం చేయాలి

మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-బాపట్ల

విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలబడి కూటమి ప్రభుత్వంపై నిరసన గళం విప్పేందుకు వైసీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న యువత పోరును జయప్రదం చేయాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో యువతపోరు పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడు దల చేయాలన్నారు. బాపట్ల మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఉపసంహరించుకోవాలన్నారు. పార్టీ మహిళా కార్యకర్తలను మేరుగ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, జిల్లా యువజన అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, మహిళా అధ్యక్షురాలు అశ్వినిరెడ్డి, ఎంపీపీ చినపోతులహరిబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, జోగి రాజా, మహిళా నాయకులు గొర్రెముచ్చు పుష్పరాజ్యం, లక్ష్మీరాఘవ, మీరాబి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగ

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరులోని వెలుగు కార్యాలయం ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కే ప్రశాంతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. మహిళ కుటుంబ బాధ్యతను చక్కగా నిర్వహిస్తున్నదని తెలిపారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టాలన్నారు. జూనియర్ జడ్జి శాంతి మాట్లాడుతూ మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ దేవతలు పూజింపబడతారనే సూక్తి ఆచరించాలని తెలిపారు. ఆడపిల్లలు పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటీసీ ఉషారాణి, ఎంపిటీసీ పి.పద్మ, ఏపీఎం రామకృష్ణ, న్యాయవాదులు ధనలక్ష్మి, రుక్సానా, వెలుగు సీసీలు విజయకుమార్, ప్రమీల, నరసింహారావు, వివోఏలు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 133 కేసులు పరిష్కారం అయినట్లు సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఆరు కేసులు పరిష్కారం కాగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 125 కేసులు పరిష్కారం అయినట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలతో జూనియర్ సివిల్ జడ్జి శాంతి, కక్షిదారులు, న్యాయవాదులు సిహెచ్ శ్రీరమని, డి.రాఘవ య్య చౌదరి, పోతిన సురేంద్ర, కొల్లా నరేంద్ర కుమార్, ఎం.రవీంద్రనాథ్ రెడ్డి, వి.తిరుమలరావు, ఓ.గోవింద రాజులు, టి.సురేష్ బాబు, కట్టా సాల్మన్, రావి రమేష్ బాబు, పి.జాన్ బాబు, రావి శ్రీనివాసరావు, చాగంటి సుబ్బారావు, రావి సత్యనారాయణ పాల్గొన్నారు.

అద్దంకి: అద్దంకి కోర్టు భవనముల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కేసుల పరిష్కారాల కోసం రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్‌లో డి.నాగ వెంకటలక్ష్మి సీనియర్ సివిల్ జడ్జి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా న్యాయవాదులు డి.హైగ్రీవా చారి, ఎస్.రమణయ్య మెంబర్స్‌గా రెండవ బెంచ్‌లో శ్రీమతి జె శ్రీ సీతగారు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా మరియు టి.అనూష, కె.సంజీవ్ బాబు మెంబర్స్‌గా వ్యవహరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ హాల్లో న్యాయమూర్తులు డి.నాగ వెంకటలక్ష్మి, జె.సీత లను ఘనంగా సన్మానించారు. మహిళా ప్రాసెస్ సర్వర్‌ని కూడా సన్మానించారు. అనంతరం స్థానిక బాలికల బీసీ హాస్టల్‌లో సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ న్యాయవాదులు టి.మార్తా శ్రీనివాస్, ఎం.ప్రకాష్ పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మార్టూరు సమీపంలోని నాగరాజుపల్లి – వలపర్ల మధ్యలోని పంట పొలాల్లో శనివారం వెలుగు చూసింది. సీఐ మాదినేని శేషగిరిరావు కథనం ప్రకారం.. మండల పరిధిలోని వలపర్ల ఎస్సీ కాలనీకి చెందిన తాళ్లూరి చినబాబు(35), రాణి దంపతులు తమ ఇద్దరు పిల్లలను ఇంకొల్లులోని ప్రభుత్వ హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారు. ఇటీవల పొగాకు పనుల నిమిత్తం దర్శి గ్రామానికి వెళ్లారు. అక్కడ చిన్న బాబు ఆరోగ్యం సరిగా లేదని తిరిగి వలపర్ల గ్రామానికి వచ్చి స్థానిక వైద్యుడు వద్ద చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో తనకు ఆందోళనగా ఉందని భార్యతో చెప్పిన చినబాబు శుక్రవారం సాయంత్రం నుంచి కనబడకుండా పోయాడు. శనివారం ఉదయం శవమై పంట పొలాల్లో పడి ఉన్న చినబాబుని గుర్తించిన స్థానికులు మార్టూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ శేషగిరిరావు మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ షేక్ సైదా దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని పందిళ్ళపల్లి శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వేటపాలెం ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్రమాలకు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం పోలీసులుగా ఉంటుందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించటం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇసుక ట్రాక్టర్లు పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల మండలం వెదుళ్లపల్లిలోని ఓ రైస్ మిల్లులో సివిల్ సప్లై అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని ఎక్కడ నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే విషయమై విచారిస్తున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఫణికుమార్ తెలిపారు.

మండే శ్యాంబాబు మృతికి సిపిఎం నేతల సంతాపం

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు మండల పరిధిలోని తిప్పలకట్ట గ్రామానికి చెందిన మండే శ్యాం బాబు హైదరాబాదులోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు లారీ తగలడంతో శ్యాంబాబు అక్కడకక్కడే మృతి చెందారు. శ్యాం బాబు మృతదేహానికి ఉస్మానియా హాస్పిటల్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. గతంలో శ్యాం బాబు సిపిఎం పార్టీ సానుభూతిపరుడు మరియు యువజన సంఘంలో చురుకుగా పాల్గొనేవారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు చార్జీలు పెంపుదల సందర్భంగా హైదరాబాదులో జరిగిన ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. శ్యామ్ బాబు మృతికి సిపిఎం కొల్లూరు మండల కార్యదర్శి వేములపల్లి వెంకట రామయ్య, నాయకులు పి.నాగమల్లేశ్వరరావు, బి ఎల్ కే ప్రసాద్, బి.సుబ్బారావు, టి.సురేష్ సంతాపం తెలిపారు.



శ్యాంబాబు(ఫైల్)



1.06 గ్రాముల బంగారంతో క్రికెట్ కప్

ఐలవరం స్వర్ణకారుడు వీరేంద్ర ప్రతిభ


ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన స్వర్ణకారుడు మాచర్ల వీరేంద్ర బంగారంతో క్రికెట్ కప్పును తయారు చేశాడు. క్రికెట్ పట్ల ఉన్న అపేక్షతో 1.060 గ్రాముల బంగారంతో కప్పు, బ్యాటు మరియు వికెట్లను తయారుచేసి క్రికెట్ ప్రేమికులను ఆకర్షించాడు. ఆదివారం జరగనున్న ఫైనల్ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ ప్రేమికులను కనువిందు చేసేందుకు ఆదివారం ఆవిష్కరించినట్లు రవీంద్ర తెలియజేశారు. స్వర్ణకారుడు వీరేంద్ర గతంలో కూడా ఐపీఎల్ కు సంబంధించిన ట్రోఫీని, చేనేత కార్మికుల మగ్గం నాడి రాట్నం, పోలీస్ టోపీ, పలు వ్యవసాయ పరికరాలు, బండి ఎడ్లు, నాగలి వంటివి తయారుచేసి ప్రజల మన్ననలు పొందారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీని తయారుచేసి ఇండియా ట్రోఫీని గెలవాలని ఆకాంక్షిస్తున్నట్లు వీరేంద్ర వివరించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా చైతన్యయాత్ర

ప్రజాశక్తి-రేపల్లె

స్థానిక సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్రలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ తెలిపారు. రేపల్లె పట్టణంలో శనివారం 21వ వార్డు పరిధిలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ 21వ వార్డులో ముస్లింలు నివాస ప్రాంతాల్లో డ్వాక్రా మహిళల పేరుతో దొంగ లోన్లు తీసుకొని ఆర్పీ మోసం చేసిన నేపథ్యంలో మహిళలును డ్వాక్రాలో కొనసాగించడానికి మెప్మా అధికారులు, బ్యాంకర్లు నిరాకరిస్తున్నారని తెలిపారు. సంబంధిత ఆర్పీ మీద చర్యలు తీసుకొని డ్వాక్రాలో మహిళలను కొనసాగించాలని కోరారు. అదేవిధంగా అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. 21వ వార్డు పరిధిలో సుమారు 40 మంది వరకు టిడ్కో ఇళ్ల కోసం గత 5 సంవత్సరాల క్రితం డబ్బులు కట్టిన ఇళ్లను పూర్తిచేసి ఇప్పించాలని, రేషన్ షాపు ద్వారా కందిపప్పు ఇవ్వాలని, ప్రభుత్వం మహిళలను ఆదుకోవటానికి ఆర్థిక భరోసా కల్పించకపోవడంతో ప్రైవేట్ బ్యాంకులు, సంస్థల వద్ద వారాలకు తీసుకుని పిల్లల చదువులు, కుటుంబపోషణ చేసుకోవడంతో అధిక వడ్డీల భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ప్రజలు చెప్పిన సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వాలు పూనుకోవాలని, అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా అమలుచేస్తామని ప్రకటించిన ప్రతి మహిళకు నెలకి రూ.1500, ఉచిత బస్సులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నివాస ప్రాంతాల్లో మహిళలు మరియు సిపిఎం నేతలు కేవీ. లక్ష్మణరావు, కె.రమేష్, జి.దానియేలు, డి. శ్రీనివాసరావు, s.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాచైతన్య యాత్రలో పాల్గొన్న సీపీఎం నేతలు

ధర్నాను జయప్రదం చేయాలి

విజయవాడలో మార్చి10వ తేదీన జరిగే అంగన్‌వాడీ ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే.ఝాన్సీ తెలిపారు. రేపల్లె సిఐటియు కార్యాలయంలో రేపల్లె ప్రాజెక్ట్ సెక్టార్ యూనియన్ లీడర్స్, ముఖ్యులు సమావేశం నిర్వహించారు. వేతనాలు పెంపుదల కోసం ఐక్యంగా కదలిరావాలన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ నాయకులు కే.రత్నకుమారి, ఎన్.కృష్ణకుమారి, డి.జ్యోతి, నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఆనందబాబు

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి-వేమూరు

పంచాయతీరాజ్, హౌసింగ్, మండల విద్యాశాఖ అధికారులతో శనివారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారులను గుర్తించాలన్నారు. నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల విద్యాశాఖ అధికారుల రివ్యూ సమావేశంలో పాఠశాల రీ కన్స్ట్రక్షన్ గురించి అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలు అందించారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకే సర్వే

ప్రజాశక్తి-రేపల్లె

పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకే ప్రభుత్వం పి-ఫోర్ సర్వే నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ జే.వెంకట మురళి తెలిపారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో పి-ఫోర్ సర్వేపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అత్యల్ప ఆదాయ వర్గాల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పబ్లిక్ ప్రైవేట్ అండ్ పీపుల్స్ పార్టనర్షిప్ అనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక సర్వేకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పి-ఫోర్ సర్వే ప్రోగ్రాం ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందులో భాగంగా సమాజంలో అత్యల్ప ఆదాయం కలిగిన 20 శాతం కుటుంబాలను గుర్తించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించి అమలు చేసే దిశగా కృషి చేస్తుందన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ఇందులో భాగంగా టాక్స్ పేయర్స్ ఉద్యోగులు ప్రభుత్వం నుంచి జీత భత్యాలు తీసుకునేవారు కాకుండా సమాజంలో అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందించినదన్నారు. సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు పాల్గొన్నారు.

యద్దనపూడి: మండలంలో జరుగుతున్న పి-4 సర్వేను ఇన్‌ఛార్జి యం. డి. ఒ పి. టి. వి కృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. మండలంలో గ్రామ పంచాయతీలను సందర్శించి సర్వేను పూర్తి స్థాయిలో ప్రారంభించేలా సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివ ప్రసాద్, బాజీ, వెల్ఫేర్ అసిస్టెంట్ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

అవయవ దాతలకు సన్మానం

ప్రజాశక్తి-బాపట్ల

మహిళల త్యాగాలు నిరుపమానమైనవని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్.విజయమ్మ అన్నారు. శనివారం పట్టణంలో రామకృష్ణాపురం పిఎస్కే నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అవయవదానానికి అరుదుగా ముందుకు వస్తున్న ఈ రోజుల్లో అవయవదానానికి మేము సైతం అంటూ ముందుకు వచ్చిన పిఎస్కె విద్యా సంస్థల కార్యదర్శి పేర్లి సంపత్ కుమారి, మరుప్రోలువారిపాలెం ఉన్నత పాఠశాల హెచ్ ఎమ్ అమిరిసెట్టి రమాదేవిలను ఆమె సన్మానించారు. బాపట్ల జిల్లా అవయవదాతల సంఘం అధ్యక్షులు డాక్టర్ కే సిద్ధార్థ మాట్లాడుతూ అవయవ, శరీర దానం కోసం మరింతమంది మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పి సి సాయిబాబు, ఎకే విద్యాసంస్థల కరస్పాండెంట్ పేర్లి సునీల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవయవదాతలను సన్మానిస్తున్న దృశ్యం

ఉత్సవ విగ్రహాలు అందజేత

ప్రజాశక్తి-చెరుకుపల్లి: మండల పరిధిలోని గూడవల్లి గ్రామంలో ఉన్న శ్రీ మైత్రేయ ఆశ్రమంలో వేంచేసి ఉన్న శ్రీ భువనేశ్వరి సమేత భువనేశ్వర్ స్వామి వారి ఆలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామస్తుడు గుమ్మడి హరి పద్మావతి దంపతులు అందించారు. శనివారం పంచలోహ ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ అనంతరం పూజలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ అగ్నిస్థాపన నిర్వహించారు. ఆదివారం బలిహారణ క్షీరాబ్దివాసం, నిత్య హెూమాలు ఉంటాయని, సోమవారం స్వామివారి కల్యాణోత్సవం ఆశ్రమం నిర్వాహకులు నిర్మల మాతాజీ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహెూత్సవాన్ని వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

ప్లాస్టిక్ నిషేధం..

ఇలా సాధ్యమేనా.?

- ఒంగోలులో ప్లాస్టిక్ కవర్లు వినియోగించే షాపుల్లోనే తనిఖీలు
- హోల్‌సేల్ షాపులపై పెద్దగా దృష్టి పెట్టని కార్పొరేషన్ అధికారులు
- తయారీ సంస్థల నుంచి నిలిపేస్తేనే ఫలితం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పర్యావరణ హితానికి ప్లాస్టిక్ కవర్ల నిషేధం తప్పనిసరి. ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ లాంటి ప్రాణాంతక జబ్బులతో పాటు పశువులు ప్లాస్టిక్ కవర్లు తిని మృత్యువాత పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అయితే ఇటీవల ఒంగోలు కార్పొరేషన్ అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై మళ్లీ యుద్ధం ప్రకటించారు. ఫాస్ట్‌ఫుడ్స్ సెంటర్లు, బేకరీలు, హోటళ్లు, కర్రీ పాయింట్లు.. ఇలా పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టి.. జరిమానాలు విధిస్తున్నారు. ఇది మంచి పరిణామమే.. కానీ ఈ తనిఖీలు నామమాత్రంగానే సాగుతున్నాయనే విమర్శలూ లేకపోలేదు. హోల్‌సేల్ షాపులపైనా, తయారీ సంస్థలపైనా సరైన దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి.

ప్రజలు ఏ వస్తువులు తెచ్చుకొనేందుకైనా నిత్యం ప్లాస్టిక్ కవర్లను వాడటం సాధారణ విషయంగా మారింది. అది ప్రమాదకరమని తెలిసినా.. ఈ బిజీ కాలంలో దాన్ని పెద్దగా పట్టించుకోవటం లేదు. చిరు వ్యాపారులు కూడా ఎవరికివారే తమ వ్యాపారం పోతుందనే భయంతో వాటిని వినియోగిస్తున్నారు. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే ప్లాస్టిక్ సమస్యను పరిష్కరించటం సాధ్యమవుతుంది. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టమన్నారు పెద్దలు.. ప్లాస్టిక్ వినియోగం అనేది ప్రస్తుతం అనకొండలా మారింది. ఇలాంటి పెద్ద సమస్యను పరిష్కరించాలంటే మూలాల నుంచే గట్టిగా ప్రయత్నం చేయాల్సి ఉంది. ఒంగోలు కార్పొరేషన్ అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనపడుతోంది.



ఒంగోలులోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు (ఫైల్)

ఒంగోలులో ఇలా.. బాపట్లలో అలా..!

ఈ నెల నాలుగో తేదీన ఒంగోలు కమిషనర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ అధికారులు, శానిటేషన్ అధికారులు మొత్తం 60 మందికి పైగా ఐదు బృందాలుగా ఏర్పడి.. నగరంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, కర్రీపాయింట్లు, స్వీట్ షాపులు.. ఇలా పదుల సంఖ్యలో దుకాణాలపై దాడులు చేసి.. 150 కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. దుకాణాదారులకు మొత్తం రూ.33,200 జరిమానా విధించారు. రెండో రోజైన బుధవారం కూడా 75 కిలోల కవర్లు స్వాధీనం చేసుకొని.. రూ.22,700 జరిమానా విధించారు. మూడో రోజైన గురువారం 25 కిలోల కవర్లు స్వాధీనం చేసుకొని.. రూ.8,500 జరిమానా విధించారు. మూడు రోజుల్లో మొత్తం 250 కిలోల వరకు ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. కార్పొరేషన్ అధికారులు ఎక్కువగా దాడులు చేసింది ప్లాస్టిక్ కవర్లు వినియోగించే షాపుల్లోనే.. ఈ దుకాణాలు, హోటళ్లలో 2 కిలోల నుంచి మహా అయితే 20 కిలోలకు మించి ప్లాస్టిక్ కవర్లు ఉండవు. ఇవి వారం లేదా రెండు వారాల్లో వాళ్ల దగ్గర అయిపోతాయి. తర్వాత ఈ వ్యాపారులు హోల్‌సేల్ షాపుల్లోనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. హోల్‌సేల్ షాపుల్లోనే ప్లాస్టిక్ కవర్లు లేకుండా చేస్తే ఈ షాపులు కూడా కవర్లు తెచ్చుకొనే అవకాశం చాలా వరకు తగ్గుతుంది.

బాపట్లలో మున్సిపల్ అధికారులు ఇదే పంథాను ఎంచుకున్నారు. వాళ్లు ఈ నెల 6న కేవలం రెండు హోల్‌సేల్ షాపులపై దాడులు చేసి ఒకే రోజు 950 కిలోల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలులో మూడు రోజుల్లో 250 కిలోలు స్వాధీనం చేసుకోగా.. బాపట్లలో ఒక్క రోజే 950 కిలోలు స్వాధీనం చేసుకోవటం గమనార్హం. ఒంగోలులోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, కొత్త కూరగాయాల మార్కెట్‌లో ఉన్న హోల్‌సేల్ షాపుల్లో ఇప్పటికీ యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నారు. ఈ హోల్‌సేల్ షాపులతో పాటు ఈ షాపులకు ప్లాస్టిక్‌ను తెచ్చే తయారీ సంస్థపై కూడా దాడులు చేస్తే చాలా వరకు ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టే అవకాశం ఉంటుంది.

ఫ్లెక్సీల నిషేధంపైనా చిత్తశుద్ధి ఏదీ.?

ఫ్లెక్సీలు కూడా పర్యావరణానికి ప్రమాదకరమే.. కానీ ఫ్లెక్సీల విషయం కూడా రాజకీయ రంగు పులుముకోవడంతో స్థానిక పాలకుల నిర్ణయాలను బట్టి 'నిషేధం' ఆధారపడి ఉంటోంది. ఈ నెల 3న ఒంగోలు నగరంలో డివైడర్లలో మొక్కలు నాటడం, రోడ్ల ఆధునీకరణ కారణంగా ఫ్లెక్సీలను అనుమతించబోమంటూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. ఈ నిషేధం పాలకవర్గంలోని గ్రూపుల మధ్య వివాదానికి సంబంధించిన విషయమని అందరికీ తెలిసిందే.. గతంలో ఎప్పుడైనా పర్యావరణ హితం కోసమనే ఫ్లెక్సీల నిషేధం విధించేవారు. కానీ ఒంగోలులో మాత్రం అభివృద్ధి పనుల కోసమంటూ ఫ్లెక్సీలను అనుమతించకపోవడం గమనార్హం.



మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు



మహిళలతో సిఎం చంద్రబాబు గ్రూప్ ఫొటో



శక్తి యాప్‌ను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

'వెలిగొండ'ను పూర్తి చేస్తా..

- కృష్ణా జలాలతో పాటు.. గోదావరి జలాలు ప్రాజెక్టుకు తరలింపు
- మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తా..
- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-మార్కాపురం

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గుర్తున్నాయని, ఈ ప్రాంతంలో సాగునీరు, తాగునీరు అందించేందుకు 'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు'ను పూర్తి చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. దీంతో పాటు మార్కాపురం జిల్లా కూడా చేసే బాధ్యత తనదేనన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సిఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సుజాత అనే మహిళ వెలిగొండ ప్రాజెక్టు అవసరమని, తాగునీరు, సాగునీటికి ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాను 50 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించినట్లు చెప్పారు. సాగునీటి వసతి లేక ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందని, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. దీనిపై సిఎం చంద్రబాబు స్పందించారు. వెలిగొండకు శంకుస్థాపన చేసింది తానేనన్నారు. పూర్తి చేసే బాధ్యత కూడా తనదేనన్నారు. వెలిగొండ ప్రాజెక్టులో కృష్ణా జలాలతో పాటు గోదావరి జలాలు కూడా నింపుతామన్నారు. గోదావరి మిగులు జలాలను వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పోలవరం నుండి కృష్ణా, బొల్లాపల్లి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, బనకచర్లకు నీరు అందిస్తామన్నారు. వెలిగొండ కోసం త్యాగం చేసిన నిర్వాసితులను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజితో ఆదుకుంటామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పనులన్నీ పెండింగ్‌లో పెట్టుకుని మాజీ సిఎం జగన్ హడావుడిగా ప్రారంభించారన్నారు. ప్రాజెక్టు పూర్తి కాకుండా, నీటిని విడుదల చేయకుండా ప్రారంభించడం జగన్ అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ముఖాముఖిలో రిషిత అనే యువతి మార్కాపురం జిల్లా చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని చంద్రబాబుకు గుర్తు చేశారు. దీనిపై కూడా చంద్రబాబు సమాధానం ఇచ్చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తానని చెప్పారు. మార్కాపురం జిల్లా ఎప్పటిలోగా చేస్తారనేది మాత్రం చెప్పలేదు. సిఎం చంద్రబాబు మహిళలతో మాట్లాడేందుకు చాలా సమయం కేటాయించారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలు, సాగుపై గట్టి నిఘా పెట్టామన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి అదే అఖరి రోజు అయ్యేలా కఠినంగా వ్యవహరించబోతున్నామన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల రక్షణ కోసం 'శక్తి' పేరుతో రూపొందించిన యాప్‌ను చంద్రబాబు ఆవిష్కరించారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్నదే తన లక్ష్యమని చంద్రబాబు న్నారు. తాజాగా 24 కంపెనీలతో మహిళలకు ఉపాధి కల్పించేలా ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. తాజాగా పది రోజుల్లో మహిళలు ఆన్‌లైన్ ద్వారా ఉత్పత్తులు అమ్మకం చేపట్టి రూ.5 కోట్ల టర్నోవర్‌తో గిన్నీస్‌బుక్ రికార్డు సొంతం చేసుకోవడం చిన్న విషయం కాదన్నారు. ఆ మహిళలను ఈ సందర్భంగా అభినందించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు మార్కాపురం విచ్చేసిన చంద్రబాబుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి, మార్కాపురం, ఒంగోలు, గిద్దలూరు, కనిగిరి, ఎస్‌ఎన్‌పాడు శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, దామచర్ల జనార్దన్‌రావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బిఎన్ విజయకుమార్, ఎపి మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రాష్ట్ర పర్యాటకాభివద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్, ఎపి అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసులరెడ్డి, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎస్‌పి ఎఆర్ దామోదర్, మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.

మహిళలకు మరింతగా ప్రోత్సాహం

మహిళలకు మరింతగా ప్రోత్సాహం అందిస్తున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం, సాధికారత, భద్రత కోసం వివిధ సంస్థలతో ఎంఓయులు కుదుర్చుకోవడంతో పాటు పలు పథకాలు, కార్యక్రమాలను సిఎం చంద్రబాబు శనివారం ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ సెర్ప్, మెప్మా, ఎంఎస్‌ఎంఈ విభాగంలో అవకాశాలు, స్వయం ఉపాధి, ఆర్థిక వెసులుబాటు కల్పించి లక్ష మంది మహిళా ఎంట్రప్రెన్యూర్‌లను తీర్చిదిద్దేందుకు నడుం బిగించినట్లు చెప్పారు. దీనికి సంబంధించి బ్రోచర్‌ను విడుదల చేశారు. మెప్మాలో 30 వేల మంది, 10 వేల మంది మహిళలను రాపిడో, 4 వేల మంది స్వయం ఉపాధి పథకాల్లో, 4 వేల మందిని కేంద్ర ప్రాయోజిత పథకాల్లో, 4 వేల మందిని పర్యాటక అనుంబంధ రంగాల్లో, 4 వేల మంది తప్తి హెూటల్స్ స్థాపన, 2 వేల మంది స్మార్ట్ స్ట్రీట్స్ వెండింగ్ జోన్‌లో, మరో 2 వేల మందికి టిడ్కో జీవనాధారం కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యంగా శక్తి టీమ్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. చేనేత రథాలను ప్రారంభించారు. వీటి ద్వారా చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఒక్కో చేనేత మహిళకు 36 చీరలు నేసే నూలును ఉచితంగా పంపిణీ చేశారు. 1.50 లక్షల మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రారంభించారు. 'మహిళలు మహిళల కోసం మహిళల చేత' కార్యక్రమంలో భాగంగా ఎన్డీసీ వేదికగా వావ్ జీని యాప్‌ని ఉపయోగించుకుని లక్షకు పైగా డ్వాక్రా ఉత్పత్తులు రికార్డు స్థాయిలో రూ.5.13 కోట్లకు విక్రయించినట్లు చెప్పారు. ఇందుకు సాధించిన గిన్నిస్ రికార్డుని ముఖ్యమంత్రికి అందజేశారు. 7,471 మంది పట్టణ పేద మహిళలకు 645.52 కోట్ల బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. ఒక్కో మహిళకు సుమారు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణం అందనుంది. డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల విక్రయాలకు ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించిన సేంద్రీయ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు.

రాపిడోతో కుదుర్చుకున్న ఒప్పందంతో ఆన్ బోర్డింగ్ ఛార్జీలు, నెలవారీ చార్జీలను మూడు నెలల పాటు మాఫీ చేస్తుందని సిఎం చంద్రబాబు తెలిపారు. దీని ద్వారా ర్యాపిడీలో ఉన్న మహిళలకు సుమారు రూ.30 వేల వరకు లబ్ధిపొందుతారని తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 1,000 ఎలక్ట్రిక్ వాహనాను మహిళా రైడర్లకు అందించారు. ఇందులో 760 ఈ-బైక్‌లు, 240 ఈ-ఆటోలు ఉన్నాయి.

నేచర్ అరకు కాఫీతో ఒప్పందం చేసుకోవడం జరిగిందని, గ్లోబల్ మార్కెట్‌లో అరకు కాఫీ ఉత్పత్తులు పెంచేందుకు, గ్రామీణ ప్రాంతాలకు అరకు కాఫీ విస్తరించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని చంద్రబాబు తెలిపారు. తొలి విడతలో 100 అరకు కాఫీ అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తారని, తద్వారా డ్వాక్రా



మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు.

రాష్ట్రంలోని 55,607 మంది అంగన్వాడీ వర్కర్లకు, 48,909 మంది హెల్పర్లకు మేలు చేకూర్చేలా మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి గ్రాట్యూటీ అమలును ప్రకటించారు. దీని ద్వారా ఒక్కో అండన్వాడీ వర్కర్ రూ.1.79 లక్షల నుంచి రూ.2.32 లక్షల వరకు, హెల్పర్లకు రూ.1.09 లక్షల నుంచి రూ.1.41 లక్షల వరకు లబ్ధి కలుగుతుంది. దీని అమలుకు ప్రభుత్వంపై ఏటా రూ.17.73 కోట్ల భారం పడుతుందని చంద్రబాబు చెప్పారు.

ఆశా వర్కర్లు ఎప్పటి నుంచో కోరుతున్న గ్రాట్యూటీని సీఎం ఈ సందర్భంగా అమలు చేశారు. గతేడాది జూన్ నుంచి అమలు చేసే గ్రాట్యూటీకి గాను రూ.1.90 కోట్లను ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు.

పిఎం-విశ్వకర్మ పథకం ద్వారా 1000 మంది మహిళలకు ప్రభుత్వం రూ. లక్ష వరకు రుణం మంజూరు చేస్తుందని చంద్రబాబు తెలిపారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్, సబ్‌కలెక్టర్ త్రివినాగ్, మారిటైం ఛైర్మన్ సత్య, ఎమ్మెల్యేలు ఉగ్ర, జనార్ధన్

సభ్యత్వంలో 104వ స్థానం.!

కందుల పనితీరుపై 'బాబు' అసంతృప్తి.!



చంద్రబాబుతో కందుల

మార్కాపురం నియోజకవర్గంలో పనితీరు బాగోలేదని, ఇలాగైతే ఎలాగని సిఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల అనంతరం స్థానిక శ్రీఅల్లూరి పోలేమ్మ ఆలయ సమీపంలో నిర్వహించిన టిడిపి ముఖ్య కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. టిడిపి సభ్యత్వంలో మార్కాపురం నియోజకవర్గం 104వ స్థానంలో ఉందన్నారు. ఇక్కడ పార్టీలో కష్టపడ్డ వారికి ఫలితం దక్కలేదని తెలిసిందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు కూడా పదిలో మూడింటిలో మాత్రమే ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొనడం ఏమిటన్నారు. దీన్ని బట్టి చూస్తే పాస్ మార్కులు కూడా రావన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో క్లష్టర్‌ల వారీగా పనితీరుపై చేసిన పరిశీలనలో మొదటి స్థానంలో వెంకటసత్యనారాయణ, రెండవ స్థానంలో కుం దురు కాశిరెడ్డి, మూడో స్థానంలో వక్కలగడ్డ మల్లికార్జునరావు, నాల్గవ స్థానంలో శ్రీనివాసులు నిలిచారు. వీరిని సిఎం చంద్రబాబు అభినందించినట్లు తెలిసింది. ఇకపై కార్యకర్తలను కలుపుకుని పోవాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

పోరాటాలే కార్మిక వర్గానికి రక్షణ

ప్రజాశక్తి-దర్శి

పోరాటాలు చేయడం ద్వారానే కార్మిక హక్కులు కాపాడుకుంటామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు జిల్లా శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. సిఐటియు నాయకులు ఈమని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆశా, అంగన్‌వాడీ, మున్సిపల్, మధ్యాహ్న భోజనం కార్మికులకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని, అమలు చేయడం కోసం సిఐటియు పోరాడుతుందని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు 65ఏళ్లు నిండిన వారికి పించన్ ఇవ్వాలని అన్నారు. కాంట్రాక్టు, ఆవుట్ సోరింగ్, మున్సిపల్ ఉద్యోగులను ఆప్కాస్ నుంచి తొలగించి కాంట్రాక్టు విధానాన్ని తీసుకురావాలనే మంత్రి వర్గ నిర్ణయాన్ని సిఐటియు వ్యతిరేకిస్తుందని అన్నారు. ప్రజానాట్యమండలి నాయకులు ఉప్పు మోహనరావు కార్మిక గీతాలు ఆలపించారు. సిఐటియు మండల కార్యదర్శి ఉప్పు నారాయణ, జాలా సుశీలా, కోటయ్య, గుడిమెట్ల ఆదాం, సుబ్బయ్య, పి అరుణ, కె పద్మా, రైతు నాయకులు సందు వెంకటేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు కెవి పిచ్చయ్య పాల్గొన్నారు.


మహిళా దినోత్సవ వేడుకల్లో డాక్టర్ మాధవీలత

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నేటి ఆధునిక యుగంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్) సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ మాధవీలత అన్నారు. ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జిజిహెచ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఉదయలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ నాగ మల్లేశ్వరి, నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమణమ్మ మాట్లాడారు. వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి మంజేష్, జానీ బాషా, మహేష్, మెహబూబి, నాగరాజుకుమారి, రమణా నాయక్, కళ్యాణ్ పాల్గొన్నారు.

దర్శి : మహిళా దినోత్సవం స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. పర్యవేక్షణాధికారి డాక్టర్ సుమన్ అధ్యక్షత వహించగా రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జికూటివ్ మెంబర్, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. మహిళా డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీపూజిత, డాక్టర్ రఫీ, గీతాపద్మ, లక్ష్మీపూజిత, శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

తాళ్లూరు : మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు సమానమని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. మహిళా దినోత్సవం నిర్వహించారు. జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డితోపాటు పలువురు ప్రసంగించారు. మండల సమైక్య అధ్యక్షులు సుజాతతో పాటు పలువురు విఓఎలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఓ సుబ్బయ్య, తెలుగుదేశం మండల అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, ఎడమకంటి శ్రీనివాస్‌రెడ్డి, గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ యాతం శ్రీనివాస్‌రెడ్డి, బెల్లంకొండ వారిపాలెం సర్పంచ్ పోశం శ్రీకాంత్, శివరాంపురం లక్ష్మీనారాయణ, నీటి సంఘ అధ్యక్షుడు శివనాగిరెడ్డి, నరసింహులు, ఎపిఎం దేవరాజ్, సీసీలు మోహన్‌రావు, సుచేంద్ర, కుమారి పాల్గొన్నారు.

మహిళా చైతన్యమే సమాజాభివృద్ధికి గీటురాయి

మహిళా దినోత్సవ సభలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె శ్రీనివాసరావు



సభలో మాట్లాడుతున్న కొమ్మోజి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మహిళా చైతన్యమే సమాజ అభివృద్ధికి గీటురాయని, దేశంలోని మహిళలందరూ విద్య సముపార్జించిన రోజునే మహిళా సాధికారతకు మార్గం సుగమవుతుందని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎం సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన మహిళా దినోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పని ప్రదేశాల్లో విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. పాఠశాలలో బాలికలకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు మాట్లాడారు. ఈసందర్భంగా యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు జి ఉమా మహేశ్వరి, ఐద్వా జిల్లా కార్యదర్శి కె రమాదేవి, ఒంగోలు ఎంఈఓ సరస్వతి, హెచ్‌ఎంలు పార్వతీ, శాంతి, ఎం శ్రీదేవి, నాగ కళ్యాణి, సంపూర్ణమ్మలను యుటిఎఫ్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఎన్ చిన్నస్వామి, నల్లూరి వెంకటేశ్వరరావు, సిహెచ్ ప్రభాకరరెడ్డి, నగర అధ్యక్షురాలు డి జ్యోత్స్నదేవి, కాట్రగడ్డ నర్సింహారావు, ఆంజనేయులు, ఎస్‌వి కొండారెడ్డి, హేమలత, ఉషారాణి, ఝాన్సీ లక్ష్మి బాయి, పద్మశ్రీ, ధనలక్ష్మి, ఎన్ శారదమ్మ పాల్గొన్నారు.

ఒంగోలు సిటీ : డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక మైత్రేయి నీట్ అకాడమీలో మహిళా దినోత్సవం నిర్వహించారు. నీట్ అకాడమి డైరెక్టర్ ఎస్ రామారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో శ్రీరామ్ సుపర్ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చాపల శాంతకుమారి మాట్లాడారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు, మైత్రేయి నీట్ అకాడమి ప్రిన్సిపాల్ ఏడుకొండలు, డివైఎఫ్ఐ నాయకులు పి కిరణ్, పి రాంబాబు, టి నవీన్, హాస్పటల్ మేనేజర్ నల్లగట్ల చిరంజీవి పాల్గొన్నారు. స్థానిక చైతన్య నర్సింగ్ కాలేజీలో మహిళా దినోత్సవంలో కె రవీంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కె జోష్ణ, కాలేజీ ప్రిన్సిపల్ కెఎం రాజకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట


పొదుపు సంఘాల మహిళలతో ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద మెప్మా సిఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం సీఎం చంద్రబాబు సరికొత్త విధానాలతో గంజాయి భూస్థాపితం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తుందని అన్నారు. శక్తి యాప్ ప్రభుత్వం ఏర్పాటు చేసి మహిళల అభివృద్ధికి అనుగుణంగా వివిధ రంగాల్లో శిక్షణ, అవగాహన కల్పించి చేయూతనిస్తుందని అన్నారు. అనంతరం 126 మెప్మా గ్రూప్ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన రూ.3.80 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్ చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఇన్‌ఛార్జి చైర్మన్ జైసన్ బాబు, కౌన్సిలర్ సూరగాని లక్ష్మి పాల్గొన్నారు.

వేటపాలెం : సమాజంలో లింగ వివక్షత లేకుండా సామాజిక అసమానతలు రూపు మాపాలని చీరాల సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధ ఆకాంక్షించారు. స్థానిక సెయింట్ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన మహిళా దినోత్సవ సభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు, ఎస్‌కె రిహానా, కె అనిత, కళాశాల ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు, జి ప్రసూన, డైరెక్టర్ సి సుబ్బారావు, ఆర్‌వి రమణ మూర్తి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జడ్జి ఎం సుధ

సమానత్వం కోసం పోరాడదాం

• పిఒడబ్ల్యు జాతీయ కన్వీనర్ సంధ్య పిలుపు • ఒంగోలులో ప్రగతిశీల సంఘాల విలీన సభ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వం కోసం పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) జాతీయ కన్వీనర్ వి సంధ్య పిలుపునిచ్చారు. శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీవో హోంలో రెండు ప్రగతిశీల మహిళా సంఘాల విలీన సభ శనివారం నిర్వహించారు. అమరవీరులకు సంతాప ప్రకటించారు. కలెక్టరేట్ నుంచి ఎన్జీఓ హోం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పిఒడబ్ల్యూ అధ్యక్షులు విష్ణు, గంగాభవాని అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో 2014 నుండి మనువాదాన్ని ప్రోత్సహించే బిజెపి ప్రభుత్వం అత్యంత పురాతనమైన పితృస్వామ్యం, మహిళల హక్కులపై అన్ని రకాలుగా దాడి పెరిగిందన్నారు. హథ్రాస్ దళిత బాలిక విషయంలోనూ, మణిపూర్‌లోని గిరిజన మహిళలు విషయంలోనూ, ఇటీవల బెంగాల్‌లోని పీజీ డాక్టర్ ఘటనలు అధికార దుర్వినియోగం నిజమని రుజువు చేశాయన్నారు. ఇటువంటి ఘటనల్లో బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం నిందితులకు వత్తాసు పలకడం నీచమైనదని విమర్శించారు. పిఒడబ్ల్యు జాతీయ కోఆర్డినేటర్ ఝాన్సీ, రమాసుందరి, బి పద్మ, ఎం లక్ష్మి ప్రసంగించారు. అరుణోదయ సాంస్కృతిక ప్రదర్శనలు, మహిళా కోలాటం అమితంగా ఆకర్షించాయి.



విలీన సభలో మాట్లాడుతున్న పిఒడబ్ల్యు కన్వీనర్ వి సంధ్య


చంద్రబాబుతో గొట్టిపాటి లక్ష్మి

చంద్రబాబు దృష్టికి ప్రజా సమస్యలు

ప్రజాశక్తి - దర్శి

మహిళా దినోత్సవ సందర్భంగా మార్కాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గంలోని వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనాయక్

విద్యతోనే మెరుగైన భవిష్యత్తు

ప్రజాశక్తి - దొనకొండ

విద్యతోనే మెరుగైన భవిష్యత్తు సాధ్యమని, అందుకే విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధ్యానత ఇస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనాయక్ పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహల్లో 10వ తరగతి విద్యార్థులకు సంక్షేమాదికారి మంత్రూనాయక్ అధ్యక్షతన శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులతో నూరుశాతం ఉత్తీర్ణత అందించాలని కోరారు.


పూజల్లో మాజీ ఎమ్మెల్యే, రిటైర్డు కలెక్టర్లు

ధ్వజస్తంభానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని శిలవారిపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ పాలాభిషేకంకు పలువురు ప్రముఖులు శనివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ముద్రబోయిన వెంకటేశ్వరరావు, రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పిడుగు బాబురావు దంపతులు, రిటైర్డ్ కలెక్టర్ నాగబాబు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పొదిలి

విద్యార్థినీ, విద్యార్థులకు భవిష్యత్తు దిశా నిర్దేశం కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన, వివిధ రంగాల్లో నిష్ణాతులైన ముగ్గురు పూర్వ విద్యార్థులచే ఆదివారం అవగాహన కల్పిస్తున్నట్లు 1982–83లో 10వ తరగతి, 1983–85లో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థుల ఆర్గనైజర్ ముక్కెర శామ్యూల్ శేఖర్ తెలిపారు. ఈ పాఠశాల్లో చదువుకుని ప్రస్తుతం చీరాల జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్ రెహనా, పొదిలికి చెందిన ఐఎఎస్ అధికారి, అస్సాం రాష్ట్ర ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి ఆరిజ్ అహ్మద్, అమెరికాలో సీనియర్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా స్థిరపడిన ఎల్ శ్రీధర్ హాజరవుతారని అన్నారు. ఇక్కడి విద్యా సంస్థలో చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ, వ్యాపారా రంగాల్లో ఉన్నత స్థాయికి చేరిన వారి అనుభవాలు ఈతరం పిల్లలకు అవసరమని అన్నారు. పొదిలి పరిసర ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన 9, 10, ఇంటర్, డిగ్రీ విద్యార్థినీ, విద్యార్థులు హాజరై విలువైన సూచనలు, సలహాలు తెలుసుకోవాలని కోరారు. వారి అనుభవాలు తెలుసుకుని పాటించి, ఉన్నత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-చీరాల

స్త్రీలు అన్ని రంగాలలో రాణించాలని, స్త్రీ లేనిదే జీవనం లేదని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఫ్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఐఎంఏ హాల్ నుంచి చీరాల గడియార స్థంభం సెంటర్ వరకు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ దేశంలో మహిళల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతున్నట్లు తెలిపారు. మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలు అందరికీ ఆయన శు భాకాంక్షలు తెలిపారు. ముందుగా నోబుల్ స్కూల్ విద్యార్థులు చేసిన స్కిట్ పలువురిని ఆలోచింపచేసింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రసిడెంట్ డాక్టర్ భవాని ప్రసాద్, చీరాల బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీదేవి డాక్టర్ పి.శ్రీకాంత్‌లు, డాక్టర్ అవంతి, డాక్టర్ ప్రీతి, ఫ్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ అశోక్ పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



మాట్లాడుతున్న ఐద్వా నాయకులు చిరంజీవి

పేరాల సిఐటియు కార్యాలయంలో..

పట్టణంలోని పేరాల సీఐటీయూ ఆఫీస్‌లో సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలపై హింస రోజు రోజుకు పెరుగు తుందన్నారు. హింసను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫల మవుతున్నాయన్నారు. ఐద్వా నాయకులు ఎం.చిరంజీవి అ ధ్యక్షత వహించగా ఆశావర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వరమ్మ, ఝాన్సీ, ఐద్వా నాయకులు ఎన్.లక్ష్మి, వి.కొటేశ్వరమ్మ, మునిసిపల్ యూనియన్ నాయకులు జి.కొటేశ్వరమ్మ, జి.ఆదిలక్ష్మి, సంధ్య కుమారి, మల్లీశ్వరి, సాయిలక్ష్మి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

అద్దంకి: ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసి యేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎంయుఏ పరిధిలోని మహిళలను డిపో కమిటీ తరపున సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ కండక్టర్ ముత్యాల నరసింహ రావు స్వీట్స్ పంపిణీ చేశారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవం వేడుకల్లో సావిత్రి భాయ్ పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ మహిళా రొటేరియన్స్ శివకుమారి, నర్రా శ్రీలక్ష్మి, పంచాగ్నుల కృష్ణవేణి, కోట అంజమ్మలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పసుపులేటి ఆంజనేయులు, కొల్లా భువనేశ్వరి, బాచిన పూర్ణ చంద్రరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, అద్దంకి లేవి ప్రసాద్, చామర్తి గురుశేఖర్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చెరుకుపల్లిలో జడ్పీటీసీ మర్రివాడ వెంకట పావనిని స్థానికులు సన్మానించారు. మహిళా అధికారులు ప్రజాప్రతినిధులను గ్రామస్తులు, ప్రజలు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

వైసీపీ ఆధ్వర్యంలో గుల్లపల్లి డాక్టర్ ఈవూరి సుబ్బారావు మెమోరియల్ ఆసుపత్రిలో వైసీపీ ఇన్చార్జి డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేశవతిని కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గం వైసీపీ మహిళా అధ్యక్షురాలు వీసం నాగలక్ష్మి, చెరుకుపల్లి మండల కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి, కరేటి శేషగిరిరావు, రామకృష్ణ, సాంబశివారెడ్డి, కాశీ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్టూరు సుగాలి తాండా అంగన్వాడీ కార్యకర్త రాజేశ్వరి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష, కార్యకర్తలు నాగ పుష్పరాణి, శైలజ పాల్గొన్నారు. ద్రోణాదుల సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్వైజర్ పద్మ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పంగులూరు: పంగులూరులోని వెలుగు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అకౌంటెంట్ భాస్కరమ్మను, అటెండర్ షకీలమ్మను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీఎం జ్యోతి ప్రసాద్ మాట్లాడుతూ మహిళా శక్తి దేశానికి ఒక వరమని అన్నారు. ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు సాల్మన్, సురేష్, చంద్రశేఖర్, మండలంలోని వివోఏలు పాల్గొన్నారు.



మహిళలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారి సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నా రు. మండలంలోని కూచిపూడిలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురు మహిళలను సత్కరించారు. కూచిపూడి సర్పంచ్ కొండముది శ్యామలకు రాష్ట్ర ఉత్తమ మహిళా సర్పంచిగా అవార్డు దక్కటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ కూచిపూడి సుమలత, ఎంపీడీవో శేషమాంబ, ఏపీఎం రాంబాబు, సూపర్వైజర్ జె.వి రమణ మ్మ, పిఓపి ఆర్డి రవిశంకర్, కార్యదర్శి తిరుమలరావు పాల్గొన్నారు.

యద్దనపూడి: మండలంలోని పోలూరులో శనివారం అంతర్జాతీయ మహిళా వారోత్సవాల ముగింపులో భాగం గా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమములో కార్యకర్తలు జ్యోత్స్న, సౌభాగ్యం, సురేంద్ర దేవి ఆయాలు పాల్గొన్నారు.

ఇంకొల్లు: ఇంకొల్లు వెలుగు కార్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన గ్రామ సంఘ సహాయకులు, మండల సమాఖ్య ఓబీ మెంబర్‌ను ఘనంగా సత్కరించారు. డిబేట్‌లో ప్రతిభ చూపిన బి.మహేశ్వరి, చెరుకూరి రజిని, పి.వెంకట రత్నంలను ఎస్ఐ జి.సురేష్ అభినందించారు. ఆటలపో టీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మహిళా మండలి భవనానికి స్థలం కేటాయింపు

మహిళా మండలికి భవన నిర్మాణానికి స్థలం కేటా యించి అవసరమైన నిధులు సాధించేందుకు కృషి చేస్తాన ని ఇంకొల్లు మండల టిడిపి అధ్యక్షులు నాయుడు హను మంతరావు అన్నారు. ఇంకొల్లు రోటరీ భవనంలో శనివారం శ్రీ మాతా మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిం చిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో తెలంగాణకు చెం దిన సాట్ మరియు ప్రియదర్శిని ఫైనాన్షియల్ అడ్వైజర్ బి.కోమలి పాల్గొన్నారు. కందిమల్ల బిందు మాధవి అధ్యక్షత న జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా మండలి సభ్యురాలు కోమలిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా మం డలి అధ్యక్షురాలు కరి శ్రీహరి, కందిమల్ల అనంతలక్ష్మి, రావి మాధవి, కవిత, కొల్లూరి పద్మ, కొల్లూరి రాధామాధవి, మహమ్మద్ రఫీ, గుంజి వెంకట్రావు శ్రీనివాసరావు, చిలుకూరి శ్రీనివాసరావు, కరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పంగులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పంగులూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంద ర్భంగా మండలంలోని ముప్పవరం గ్రామంలో బీసీ హాస్టల్ బాలికలు ర్యాలీ నిర్వహించారు. అద్దంకి రూరల్ సీఐ మల్లి కార్జున రావు, రేణింగవరం ఎస్ఐ వినోద్ బాబు ఆధ్వర్యం లో జరిగిన కార్యక్రమంలో సిఐ మల్లికార్జునరావు మాట్లా డుతూ మహిళా దినోత్సవ సందర్భంగా బాలికలకు శుభా కాంక్షలు తెలియజేశారు. ఎస్ఐ వినోద్ బాబు మాట్లాడు తూ బాలికల చదువుతోనే భవిష్యత్తు మారిపోతుందన్నారు.

బాపట్ల: బాపట్ల ఆర్టీసీ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీ య మహిళా దినోత్సవ కార్యక్రమానికి బాపట్ల మోటార్ వాహన తనిఖీ అధికారి ఎన్.ప్రసన్న హాజరయ్యారు. బాప ట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి ఆర్టీసీ డిపోల్లో ఉత్తమ సేవలు అదించిన మహిళా సిబ్బందికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ, ఆర్టీసీ వైద్యాధికారి బిజె సునీత పాల్గొన్నారు.

భట్టిప్రోలు: మండల పరిషత్ కార్యాలయంలో మండల సమైఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ డి.వి లలిత కుమారి, జడ్పిటిసి తిరువీధుల ఉదయ్ భాస్క రి, ఎంపీడీవో ఎస్.వెంకటరమణలను డ్వాక్రా యానిమే టర్లు సత్కరించారు. భట్టిప్రోలు పంచాయతీ కార్యాల యంలో సర్పంచ్ దారా రవి కిరణ్ మయి చెన్నయ్య కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం శ్రీమన్నారా యణ, సీసీలు రజిని, హానోక్, మండల సమైక అధ్యక్ష కార్యదర్శులు, కార్యదర్శి కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేదరమెట్ల: కొరిసపాడులోని డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల అధ్యక్షురాలు సాధినేని ప్రసన్న కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం జడ్పీటీసీ టి.వెంకటరమణ, సమాఖ్య అధ్యక్షురాలు ఆర్.రాజ్యంలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎస్.మాణిక్య రావు, సీసీలు, ఈవోలు పాల్గొన్నారు.

శనగ పంటను తక్కువ ధరకు అమ్ముకోవద్దు

ప్రజాశక్తి-పర్చూరు

శనగ పంటను మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముకోవద్దని ఏడిఏ మోహన్ రావు శనివారం ఒక ప్రకటనలో రైతులను సూచించారు. రబీ సీజన్‌లో పర్చూరు సబ్ డివిజన్‌లోని పర్చూరు మండలంలో 9,845 ఎకరాలు, ఇంకొల్లు మండలంలో 9,202 ఎకరాలు, కారంచేడు మండలంలో 2,855 ఎకరాలు, యద్దనపూడి మండలంలో 4,858 ఎకరాలలో శనగ పంట సాగు చేశారని తెలిపారు. ప్రభుత్వం రైతుల వద్ద శనగ కొనుగోలు చేయాలని ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. ముందస్తుగా రైతు సేవ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

కారంచేడు : శనగల కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కారంచేడు వ్యవసాయ అధికారి కె.సుధీర్ బాబు శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరం రబీ సీజన్‌లో కారంచేడు మండలంలోని కారంచేడు అదిపూడి, స్వర్ణ, కొడవలివారిపాలెం, దగ్గుబాడు, జరుబులవరపాలెం తదితర గ్రామాలలో 580 మంది రైతులు 2822 ఎకరాల్లో శనగ సాగు చేశారని తెలిపారు. ముఖ్యంగా శనగప పంటకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరగా క్వింటాల్‌కు రూ.5,650గా నిర్ణయించినట్లు తెలిపారు.శనగ పంటను అమ్మదలచిన రైతులు ముందస్తుగా రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. మండలంలోని కారంచేడు, స్వర్ణ, అదిపూడి, దగ్గుబాడు, కొడవలివారిపాలెం ప్రాథమిక సహకార సంఘాల వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి-అద్దంకి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా శాఖ -2 జిల్లా కార్యవర్గ సమావేశం అద్దంకిలోని పుట్టంరాజు కళాక్షేత్రంలో అధ్యక్షులు శ్రీ రావుల బాపయ్య చౌదరి అధ్యక్షతన నిర్వమించారు. ఈ సమావేశంలో పెన్షనర్ల సమస్యలను చర్చించారు. కుటుంబ పెన్షనర్‌ల పుట్టిన తేదీ నమోదు విషయంలో ట్రెజరీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి అందాల్సిన అడిషినల్ క్వాంటమ్ పెన్షన్ పొందడానికి సహకరించాలని కోరారు. పెన్షనర్ల సమస్యలపై చీరాల, అద్దంకి ఉపఖజానా అధికారుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రియల్ 12న మార్టూరు, 19న ఇంకొల్లు, 26న అద్ధంకి శాఖలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇంకా లైఫ్ సర్టిఫికెట్‌లు అప్‌డేట్ కాని పెన్షనర్‌ల జాబితాలను అందజేయాలని మార్టూరు, అద్ధంకి, చీరాల ఉపఖజానా అధికారులను కోరారు. ఈ సమావేశంలో అధ్యక్షులు రావుల బాపయ్య చౌదరి, ప్రధాన కార్యదర్శి కరి కమలేశ్వరరావు, కోశాధికారి పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, అద్ధంకి శాఖ అధ్యక్షులు షేక్ మస్తాన్, ప్రధాన కార్యదర్శి టి.కృష్ణయ్య, కోశాధికారి మారం కోటేశ్వరరావు, మార్టూరు అధ్యక్షులు షేక్ కమాలుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎం.చిట్టిబాబు, కోయలమూడి హనుమంతరావు, ఎన్.నాగేశ్వరరావు, సత్యనారాయణ శర్మ, ఇంకొల్లు శాఖ నుంచి యు.వి.గోపాలరావు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు ఇంకొల్లు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ సంయుక్తంగా శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో శనివారం ఇంకొల్లు జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు గ్రామపంచాయతీ కార్మికులకు, మహిళా పోలీసులు, అంగన్వాడి సూపర్వైజర్లకు పూలమాల శాలువాలతో ఘన సన్మానం చేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి మొత్తం 364 మంది హాజరు కాగా 54 మందిని కంటి శస్త్ర చికిత్సకు వైద్యులు ఎంపిక చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ నిరంతరం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, పొద వీరయ్య, పాలేరు రామకృష్ణ, వీరగంధం ఆంజనేయులు, డాక్టర్ శ్యామ్, కొల్లూరి శివాజీ, రఫీ, మార్క్, శీను, మహిళా నాయకురాలు సంధ్య, రాజ్యలక్ష్మిలు పాల్గొన్నారు. సిఐ రమణయ్య, ఎస్సై సురేష్‌లు పలువురు మహిళలను శాలువాలతో సత్కరించారు.



సభ్యత్వం కార్డులు అందజేస్తున్న దృశ్యం

సభ్యత్వంతో టీడీపీ కార్యకర్తలకు భరోసా

ప్రజాశక్తి-పర్చూరు

ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పించే లక్ష్యంతో పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల టిడిపి నాయకులు షేక్ షంసుద్దీన్, మక్కిన శేఖర్ బాబు, మానం హరిబాబు అన్నారు. శనివారం పర్చూరు టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్డులను ఆయా గ్రామాల నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు విపత్తు సమయాలలో ఆర్థిక భరోసా కల్పించేందుకు చంద్రబాబునాయుడు, లోకేశ్‌లు బీమా కల్పించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పలనేని నరేంద్ర, వెంకట్, శేషగిరి, షేక్ గౌస్, కొండ్రగంటి శివ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గిరి, తన్నీరు శివరామయ్య, చెరుకూరు శ్రీధర్, వెంకటేశ్వరరావు, సురేష్, కోడూరి బ్రహ్మం, లాల్ అహ్మద్ ఎన్ కిషోర్, అబ్రహం, జీవన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

ప్రజా చైతన్య యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని అరుణోదయ కాలనీలో ప్రజా చైతన్య యాత్రను సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు శనివారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా సిపిఎం నేతలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అరుణోదయ కాలనీ ఏర్పడి 30 సంవత్సరాలు అయిందని, అయినా శాశ్వత మంచినీటి సౌకర్యం లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని బందం దష్టికి స్థానికులు తీసుకొచ్చారు. 15 సంవత్సరాల క్రితం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారని, పైపులైన్ వేసి ప్రారంభించారు గానీ ఒక్క చుక్క నీళ్ళు కూడా వదల్లేదని చెప్పారు. వాడుకోవడానికి కూడా నీళ్ల కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. డ్రైనేజీలు కూడా శుభ్రం చేయటం లేదని వారు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి పనుల కోసం పట్టణానికి వచ్చి అద్దెలకు ఉంటూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. వచ్చే కూలి తిండికే సరిపోతుందని, స్థలాలు కొనుక్కునే పరిస్థితులలో లేమని చెప్పారు. ప్రభుత్వం గతంలో పట్టాలు ఇచ్చింది గానీ స్థలాలు చూపలేదని, ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తమ సమస్యలను బందం దష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, మండల నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, స్థానిక నాయకులు షేక్ కాలేషా, షేక్ కాశిం పాల్గొన్నారు.

సమాన హక్కుల కోసం ఉద్యమించాలి

జనవిజ్ఞానవేదిక గౌరవాధ్యక్షులు ఏవి పుల్లారావు పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళలంతా సమాన హక్కుల కోసం సమానత్వ సాధన కోసం ఉద్యమించాలని జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు ఏవి పుల్లారావు పిలుపునిచ్చారు. స్థానిక సత్యనారాయణపురంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పుల్లారావు మాట్లాడుతూ సంపద సష్టికి సమాజ అభ్యున్నతికి పాటుపడుతున్న మహిళలకు సమానత్వం నేటికీ లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఆటంకాలు అధిగమిస్తూ సమాజ మనుగడకు తమ శక్తినంత ధారపోస్తున్న మహిళలకు నేటికీ సమాన హక్కులు దక్కలేదని, సమాన హక్కుల సాధనకు సమైక్యంగా ఉద్యమాలు చేయడం ద్వారానే వాటిని సాధించుకోగలరని అన్నారు. పౌర సంఘాల సమాఖ్య కార్యదర్శి జి రమేష్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు గడిచినా మహిళలు వివక్షతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ మహిళలపై హింస రోజురోజుకూ పెరగడానికి మరొక ప్రధాన కారణం మద్యాన్ని ప్రభుత్వం ఆదాయ వనరుగా మార్చిందన్నారు. కార్యక్రమానికి ఐద్వా నగర కార్యదర్శి జి. ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ వేముల మాలకొండయ్య, ఐద్వా నాయకురాలు కే.రాజేశ్వరి, పెద్దినేని లక్ష్మి, వై.మల్లేశ్వరి, ఎన్.హరిణి, పి.ఉష, వి.విజయ, పి.భారతి, కే. కోటేశ్వరమ్మ, కే.ఈశ్వరమ్మ, కే.లక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుల్లారావు

విద్యుత్ ఈఈగా భాస్కర్‌రావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా జి.భాస్కరరావు శనివారం నాడు బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లాలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు బాపట్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసిన జి.ఆంజనేయులు ఉద్యోగోన్నతిపై జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా భాధ్యతలు చేపట్టారు. ఆయన స్థానంలో భాస్కర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల డిఇ టి.శ్రీనివాసరావు, పొన్నూరు డిఈ శ్యామ్ అభినందించారు.



భాస్కర్‌రావు

10 నుంచి పొగాకు కొనుగోళ్లు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈ నెల పది నుంచి పొగాకు కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు వెల్లడించారు. శనివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ బోర్డు పరిధిలోని నాలుగు ఫ్లోర్లు కందుకూరు ఒకటవ కేంద్రం, ఒంగోలు ఒకటో కేంద్రం, పొదిలి, కొండపిలో ప్రాథమికంగా కొనుగోళ్లు మొదలవుతాయని పేర్కొన్నారు. ఆయా ఫ్లోర్ల పరిధిలో సుమారు పది వేల మంది రైతులకు వెసులుబాటు కలుగుతుందన్నారు. గత ఏడాది పొగాకు కిలో రూ.230తో ప్రారంభం కాగా గరిష్టంగా రూ.337 రేటు దక్కినట్లు ఆయన వివరించారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న రీత్యా క్యూరింగ్ విషయంలో రైతాంగం తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఖచ్చితంగా ధర్మామీటర్ వినియోగించాలని తెలిపారు. అగ్నిప్రమాదాలు పొంచి ఉన్నందున బేరెన్ల వేడి గొట్టాలపై కొత్త జల్లెడలను అమర్చుకోవాలని సూచించారు. గ్రేడింగ్ లో అన్య పదార్థాలు (కాగితాలు, చెత్త, ఆకులు) వంటివి కలవనీయకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పొగాకు బేళ్లు 150 కిలోలకు మించకుండా ప్యాకింగ్ చేసుకోవాలని, లేనిపక్షాన ఆ రోజు వేలంలో తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని వివరించారు. కర్ణాటకలో కిలోకు కనిష్టంగా రూ.330 ధర లభించడం వల్ల ఇక్కడా అదే రీతిలో అధిక ధర లభిస్తుందని రైతాంగం ఆశతో ఉన్నారన్నారు. ఈ ఏడాది సాగు ఖర్చు పెరిగినప్పటికీ మేలు రకం పొగాకు ఉత్పత్తి పెరిగిందన్నారు. దీంతో ధరలపై రైతాంగం ఆశాజనకంగా ఉన్నట్లు తెలిపారు.



మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

మహిళలకు సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా, ఏపీటీసీఏ ఒంగోలు వారు సంయుక్తంగా స్థానిక హర్షిణీ డిగ్రీ కాలేజీ సెమినార్ హాల్ నందు 'మహిళకు పురస్కారం' అనే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా దామచర్ల నాగసత్యలత. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కె రవళి, హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల కవిత హాజరై వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళామణులకు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. కార్యక్రమానికి జెసి వి.ప్రశాంతి వేదిక పైకి ఆహ్వానించగా జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు జెసి ఎం.వి సుబ్బా రావు, ఏపీటీసీఏ నగర అధ్యక్షులు ఈవిఎస్ లక్ష్మి, జేఏసీ ఛైర్మన్ వీ శ్రీరాములు రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ప్రజానాట్య మండలి మాజీ జిల్లా కార్యదర్శి జేసి జి.బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. స్కూలు నిర్వహణ, వివిధ సంస్థలు, వివిధ సంఘాలలో బాధ్యతలను అత్యంత ప్రతిభా వంతంగా నిర్వహిస్తున్న ప్రముఖ మహిళా మణులు 30 మంది ముఖ్య అతిథులు, జె సి ఐ, నాయకులు ఏపిటిసిఏ నాయకులు ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవం, మహిళలు సాధించిన విజయాలకు గుర్తుగా నాగ సత్య లత కేక్ కట్ చేసి పలువురు మహిళలకు తినిపించారు. కార్యక్రమంలో జెసిఐ నాయకులు, ఏపీటీసీఏ నాయకులు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే మహిళల సంక్షేమం

వైసీపీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అన్ని రకాల పదవులలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఇళ్ల పట్టాలను మహిళల పేరు మీదనే మంజూరు చేశారని గుర్తు చేశారు. త్వరలోనే జమిలి ఎన్నికలు రాబోతున్నాయని, ఆ ఎన్నికల్లో మహిళలంతా జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున , జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జ్ చుండూరి రవి, వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, వైసిపి రాష్ట్ర నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మను ఘనంగా సన్మానించారు.



వెంకాయమ్మను సత్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు

ప్రజాశక్తి-చీమకుర్తి

సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు అన్నారు. శనివారం స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో జరిగిన సమావేశానికి పూసపాటి వెంకటరావు అధ్యక్షత వహించారు. ఎస్‌కె.బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల అధ్యయనం కోసం సిపిఎం గ్రామగ్రామాన ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తోందని, వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు. పరిష్కారం కాని పక్షంలో ఆందోళన, పోరాట కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. మండలంలో ప్రజలు ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు కర్తవ్యాలు ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పమిడి వెంకటరావు, మండల నాయకులు తొట్టెంపూడి రామారావు, ఎస్ ఆదినారాయణ, క్రిష్టిపాటి చిన్నపరెడ్డి, కొల్లూరు వెంకటేశ్వర్లు, నల్లూరి కష్ణయ్య, ఎన్ శ్రీను, సిహెచ్ కొండయ్య, కుమ్మిత శ్రీనివాస్ రెడ్డి, పులి ఓబుల్ రెడ్డి, కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు

దాడులు జరిగినా కేసుల్లేవు.!

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధించారు. పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రజాసంఘాల తోడ్పాటుతో కూటమి అభ్యర్థికి గట్టి పోటీ ఇచ్చారు. సజావుగా ఎన్నికలు జరిగితే ఓడిపోతామన్న భయంలో కూటమి మద్దతుదారులు పోలింగ్ రోజున అరాచకం సృష్టించారు. యథేచ్ఛగా దొంగ ఓట్లు వేయించారు. పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు ఎన్నికల ప్రచారం మొదలు పెట్టినప్పటికి నుంచి ఆయన మద్దతుదారులను బెదిరిస్తూ వచ్చారు. పోలింగ్ బూత్‌లో పిడిఎఫ్ తరపున ఏజెంట్లు లేకుండా చేసేందుకు గొడవలకు దిగారు. పోలింగ్ రోజు అధికారులపై పలురకాలుగా ఒత్తిడి తెచ్చారు. బాపట్ల మున్సిపల్ ఉన్నతపాఠశాల పోలింగ్ బూత్ వద్ద దొంగ ఓట్లు వేసే ప్రయత్నాలను అడ్డుకోబోయిన పిడిఎఫ్ అభ్యర్థి మద్దతుదారు అనిల్‌పై బాపట్ల టిడిపి పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు దాడి చేశాడు. పిడిఎఫ్ అభ్యర్థి మద్దతుదారులపై జరిగిన దాడి విషయమై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసినా నేటికీ కేసులు నమోదు చేయని పరిస్థితి ఉంది. దాడి జరిగిన ఘటనకు సంబంధించి తగిన ఆధారాలను ఇచ్చినప్పటికీ కేసు నమోదుకు అవి సరిపోవని చెప్పడాన్ని బట్టి పోలీసులపై అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉందని భావించాల్సి వస్తోంది.



ప్రకాశం జిల్లా, మార్కాపురంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసేది తానేనంటూ హామీ ఇచ్చారు. సభలో పాల్గొన్న మహిళ ఒకరు తమకు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీరు రావడం లేదని, త్వరగా నీరు వచ్చేలా చూడాలని సిఎంను కోరారు. "ఏంటమ్మా, వెలిగొండ ద్వారా నీళ్ళు ఇంకా రాలేదా ? వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసేశా! జాతికి అంకితం చేసేశ్రా! అని మాజీ ముఖ్యమంత్రి డబ్బా కొట్టుకున్నాడు కదా?' అంటూ.. అప్పటి సిఎం జగన్ వైఖరిని చంద్రబాబు ఎండగట్టారు. నాడు వెలిగొండ ప్రాజెక్ట్ మొదలుపెట్టింది తానేనని, ఉత్తుత్తి ప్రారంభోత్సవం కాకుండా, నీళ్ళు ఇచ్చేలా వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం చేస్తామని హామీ ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా గుర్తించి త్వరితంగా పూర్తి చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం మొన్నటి బడ్జెట్లో అర కొర నిధులు కేటాయించింది. గత వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయకుండానే ప్రజలకు అంకితం చేసి మోసం చేయగా ఆ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. తమ కలలు నెరవేరుస్తారనే ఆశతో కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడానికి సుమారు రూ.4 వేల కోట్లు అవసరం అవుతాయని రూ.1,458 కోట్లతో మొదటి దశ 2027 నాటికి పూర్తి చేస్తామని వెలిగొండ ప్రాంతంలో పర్యటించిన నీటిపారుదల శాఖ మంత్రి ఇటీవలే ప్రకటన చేశారు. ఈ బడ్జెట్లో రూ.2000 కోట్లు అయినా కేటాయిస్తారని ప్రజలు ఆశించారు. కానీ కేవలం రూ.359 కోట్లు కేటాయించడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా అరకొర నిధులతో వెలిగొండ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తి అవుతుందనేది ప్రశ్నార్థకంగా ఉండిపోతోంది. దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్, ఒంగోలు విమానాశ్రయం, చీరాల పిషింగ్ హార్బర్‌ల పరిస్థితి ఏమిటనేది ప్రస్తావన లేకుండా పోయింది.

వేసవి కాలం దష్ట్యా జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు సత్వరమే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. నాగార్జునసాగర్ కెనాల్ నుండి ఈ నెల 15 వరకు మాత్రమే నీరు విడుదలవుతుంది. మంచినీటి చెరువులు అడుగంటిన నేపథ్యంలో తక్షణమే చెరువులు నింపాల్సి ఉంది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా